


ఉద్యోగుల వర్క్ టూ రూల్

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ ఉద్యోగులు శుక్రవారం వర్క్ టూ రూల్ పాటించారు. అమరావతి జెఎసి పిలుపు మేరకు డిమాండ్ల పరిష్కారం నిమిత్తం నిరసన చేపట్టామని పలువురు ఉద్యోగులు తెలిపారు. ఈ సందర్భంగా మొగల్తూరు రెవెన్యూ కార్యాలయ ఉద్యోగులు ఐదు గంటలకు విధులు ముగించుకుని నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ కార్యాలయాన్ని మూసివేశారు.



వర్క్ టు రూల్ నిర్వహిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

సిఎం సారూ.. కొల్లేరు హామీలు గుర్తున్నాయా..!

రెగ్యులేటర్ల నిర్మాణం ఏమైందో
ముందుకు సాగని భూముల రీసర్వే
ధ్వంసం చేసిన జిరాయితీ భూముల కోసం రైతుల ఎదురుచూపు
కొల్లేరు గ్రామాల్లో తాగునీరు, ఉపాధి సమస్యలతో జనం సతమతం
పోలవరం నిర్వాసితుల పరిహారం సం'గతేంటీ'
నేడు దెందులూరులో సిఎం జగన్ పర్యటన



సభా ప్రాంగణం



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంఎల్ఎ అబ్బయ్య చౌదరి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఇతర అధికారులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిఎం సారూ.. కొల్లేరుపై గుప్పించిన హామీలు అమలు చేసేదెప్పుడంటూ అక్కడి ప్రజలు ప్రశ్నిస్తున్న పరిస్థితి ఉంది. శనివారం కొల్లేరు ప్రాంతమైన దెందులూరు పర్యటనకు సిఎం జగన్ రానుండటంతో కొల్లేరు ప్రజలకు ఆయన ఇచ్చిన హామీలపై సర్వత్రా చర్చ సాగుతోంది. 2022 మే 16న గణపవరంలో సిఎం పర్యటించారు. ఈ సందర్భంగా కొల్లేరు ప్రజలకు పలు హామీలు గుప్పించారు. దాదాపు ఏడాది అవుతున్నా ఇప్పటికీ అవేమీ అమలుకు నోచుకోని దుస్థితి ఉంది. కొల్లేరులోకి సముద్రం నుంచి ఉప్పునీరు రాకుండా ఆకివీడు మండలం దుంపగడప, మొగల్తూరు మండలం పడితడక వద్ద, మొల్లపర్రు గ్రామాల సమీపాన మొత్తం మూడు రెగ్యులేటర్లు నిర్మించనున్నట్లు ప్రకటించారు. అందుకుగాను రూ.412 కోట్లు అంచనాలకు సంబంధించి ఉత్తర్వులు సైతం జారీ చేసినట్లు తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి జూన్‌లో శంకుస్థాపన చేయనున్నట్లు హామీ ఇచ్చారు. దాదాపు ఏడాది గడిచిపోయింది. ఇప్పటి వరకూ రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి శంకుస్థాపన సైతం జరగలేదు. అసలు రెగ్యులేటర్ల నిర్మాణం జరిగేనా అనే అనుమానం నెలకొంది. ప్రకటనలు గొప్పగా ఉంటున్నా ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదనే చర్చ జనాల్లో నెలకొంది. అదే సభలో కొల్లేరు భూములకు సంబంధించిన రీసర్వే పనులు గురించి మాట్లాడుతూ కరోనా కారణంగా పనులు ముందుకు సాగలేదని, త్వరలోనే పూర్తి చేస్తామని సిఎంనే స్వయంగా ప్రకటించారు. కొల్లేరులో భూముల రీసర్వే జరిగితే ఎన్నో కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. ఆపరేషన్ కొల్లేరు పేరుతో 2006లో ప్రభుత్వం జిరాయితీ భూముల్లోని చెరువులను సైతం బాంబులు పెట్టి ధ్వంసం చేసింది. కనీసం పరిహారం కూడా ఇవ్వలేదు. ధ్వంసం చేసిన జిరాయితీ భూములకు సంబంధించి లెక్కలు తేల్చి అప్పగించాలని కొల్లేరు ప్రజలు ఎప్పటి నుంచో కోరుతున్నారు. రీసర్వే జరిగితే దాదాపు పది వేల ఎకరాల వరకూ రైతులకు అందే అవకాశం ఉందని వైసిపి ఎంఎల్ఎలు సైతం చెబుతున్నారు. రీసర్వే పనులు పూర్తి చేసి జిరాయితీ భూముల లెక్క ఇప్పటికీ తేల్చని పరిస్థితి నెలకొంది. కొల్లేరు పర్యాటక అభివృద్ధికి సంబంధించి హామీలు కాగితాలకే పరిమితమయ్యాయి. కొల్లేరు ప్రాంత ఎంఎల్ఎలతో జిల్లా అధికారులు పర్యాటకాభివృద్ధిపై సమావేశం సైతం నిర్వహించారు. బోటు షికారుతోపాటు అనేక అభివృద్ధి కార్యక్రమాలపై చర్చలు జరిగాయి. ఏడాది గడుస్తున్నా ఇప్పటికీ ఒక్క అడుగు కూడా ముందుకు పడిన దాఖలాలు లేవు. దీంతో కొల్లేరు ప్రాంత ప్రజలకు సరైన ఉపాధి లేక వలస పక్షుల్లా వివిధ రాష్ట్రాలకు వెళ్లి బతుకులు నెట్టుకొస్తున్నారు. కొల్లేరు గ్రామాల్లో తాగునీటి సమస్యతో జనం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెట్టున్నపాడు, మల్లవరంతోపాటు కైకలూరు మండలంలోని అనేక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొల్లేరు గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారానికి ఆగడాలలంకలో రూ.20.61 కోట్లతో రిజర్వాయర్ తరహా ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ అడుగు ముందుకు పడలేదు. తాగునీటి సమస్య పరిష్కరించాలని కొల్లేరు ప్రజలు కోరుతున్నా పెద్దగా పట్టించుకోని దుస్థితి నెలకొంది.

పోలవరం నిర్వాసితుల సం'గతేంటీ'

పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను అన్నివిధాలా ఆదుకుంటామని ప్రభుత్వం చెబుతున్న మాటలకు, ఆచరణకు ఏమాత్రం పొంతన లేకుండాపోయింది. ఇది కేంద్రం పరిధిలోని ప్రాజెక్టు అయినప్పటికీ కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు సాధించడంలో పూర్తిగా విఫలమైంది. 41.15 కాంటూరు వరకూ ఉన్న గ్రామాల నిర్వాసితులకు వెంటనే పరిహారం అందించి ఖాళీ చేయిస్తామని గడిచిన జులైలో విరుచుకుపడిన వరదల సమయంలో అక్కడ పర్యటించిన సిఎం హామీ ఇచ్చారు. నెలలు గడిచిపోతున్నా పరిహారం మాత్రం ఇవ్వలేదు. 41.15 కాంటూరు పరిధిలో కుక్కునూరు మండలంలో ఎనిమిది గ్రామాలు ఉండగా 2,977 కుటుంబాలు ఉన్నాయి. వేలేరుపాడు మండలంలో 15 గ్రామాలుండగా 4,094 కుటుంబాలు ఉన్నాయి. రెండు మండలాల్లోనూ ఖాళీ చేయించాల్సిన కుటుంబాలు 7,071 ఉన్నట్లు లెక్కలు తేల్చారు. ఇప్పటి వరకూ మొత్తంగా 200 కుటుంబాలకు మాత్రమే పరిహారం అందినట్లు తెలుస్తోంది. వేసవి వచ్చేసింది. అనంతరం వర్షాకాలం ప్రారంభం కానుంది. పరిహారం ఇస్తారో లేదో కూడా తెలియని దుస్థితి నెలకొంది. అంతేకాకుండా పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు ఇస్తామని, 2006కు ముందు సేకరించిన భూములకు రూ.ఐదు లక్షలు చొప్పున ఇస్తామని నిర్వాసితులకు ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ఈ హామీలు కూడా నెరవేర్చని పరిస్థితి ఉంది. సిఎం జిల్లాకు రానుండటంతో తమ సంగతేంటంటూ నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. ఇక 45.72 కాంటూరు పరిధిలో ఉన్న 14,703 కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

సిఎం పర్యటన సాగేదిలా

శనివారం ఉదయం పది గంటలకు తాడేపల్లి నివాసం నుంచి సిఎం బయలుదేరుతారు. 10.30 గంటలకు దెందులూరు చేరుకుంటారు. 10.50 గంటలకు బహిరంగ సభలో వైఎస్ఆర్ ఆసరా ఆర్థిక సాయాన్ని సిఎం విడుదల చేస్తారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 1.05 గంటలకు దెందులూరు నుంచి బయలుదేరి 1.35కు తాడేపల్లిలోని నివాసానికి చేరుకుంటారు.

భగ్గుమన్న తెలుగు తమ్ముళ్లు

సీతారామలక్ష్మికి వ్యతిరేకంగా ర్యాలీ



నినదిస్తున్న నేతలు, కార్యకర్తలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

మాజీ ఎంపి, టిడిపి జిల్లా అధ్యక్షురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మిని పార్టీ పదవుల నుంచి తొలగించాలంటూ తెలుగు తమ్ముళ్లు ర్యాలీ నిర్వహించడం చర్చనీయాంశమైంది. రాము స్వీట్స్ సెంటర్ నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు చెరుకూరి రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ సీతారామలక్ష్మి తమలాంటి వారిని అన్యాయం చేశారని విమర్శించారు. పట్టణంలోని 39 వార్డుల్లోని టిడిపి అధ్యక్ష కార్యదర్శులు తనను అధ్యక్షునిగా ఎన్నుకుంటే సీతారామలక్ష్మి ప్రకటించకుండా అన్యాయం చేశారన్నారు. మాజీ మంత్రి పీతల సుజాతకు తగిన గుర్తింపు ఇవ్వకుండా అడ్డుపడే వారన్నారు. ఆమెను వెంటనే పార్టీ పదవుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు.

అంగన్వాడీ పోస్టులు అర్హులకు కేటాయించాలి


చట్టవిరుద్ధమైన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలి
అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో అంగన్వాడీ పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్ చట్టవిరుద్ధమని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.రూప్సీలక్ష్మి, డి.కళ్యాణి ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్వాడీ నియామకాల్లో వర్కర్ పోస్టుల్లో ఇప్పటి వరకూ ఆయాలు, మినీ వర్కర్లుగా పని చేస్తున్న వారిని నియమించాల్సి ఉండగా పేర్కొన్నారు. గతం నుంచి జరుగుతున్న ఈ ప్రక్రియను పక్కనపెట్టి రాజకీయ, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు అడ్డగోలుగా నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉత్తర్వుల ప్రకారం ఇప్పటికే సహాయకులుగా పని చేస్తున్న వారికి కార్యకర్తగా అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీనికి సిడిపిఒ, పిడీ బాధ్యత వహించాలని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో హెల్పర్లకు ఉద్యోగోన్నతులపై తమ వద్ద ఉన్న వివరాలను అధికారులకు అందజేశామని, వాటిని పట్టించుకోకుండా అడ్డగోలు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. ఈ విషయంలో కలెక్టర్ జోక్యం చేసుకుని తక్షణమే నోటిఫికేషన్ రద్దు చేసి అర్హులైన హెల్పర్లకు, మినీ వర్కర్లకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యపై ప్రిన్సిపల్ సెక్రటరీకి వినతిపత్రం అందజేశామని తెలిపారు.

రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించాలి

కలెక్టర్ ప్రశాంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో వివిధ పాఠశాలల్లో ఉన్న 40 వేల మంది పిల్లల్లో ఇప్పటి వరకూ 39 వేల మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించారని, ఇంకా వెయ్యి మందికి రక్తహీనత నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని, వీటిని రెండు రోజుల్లో పూర్తి చేసి రక్తహీనత కలిగిన పిల్లలను గుర్తించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. నవరత్నాలతో అనుసంధానమైన ఇండికేటర్స్ డేటా ఎస్‌డిజి వెబ్‌సైట్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. బడిఈడు పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో రక్తహీనతకు గురికాకుండా పౌష్టికాహారం అందించడంతోపాటు, సంబంధిత మందులను రోజుకు రెండుసార్లు అందజేసేలా చూడాలన్నారు. సమావేశంలో సిపిఒ కె.శ్రీనివాసరావు, జిల్లా జిఎస్‌డబ్ల్యుఎస్ అధికారి కెసిహెచ్.అప్పారావు, డిఎంహెచ్ఒ డాక్టర్ డి.మహేశ్వరరావు, డిఇఒ ఆర్‌వి.రమణ, ఐసిడిఎస్ పీడీ బి.సుజాతరాణి పాల్గొన్నారు.

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయాలి

పేదల ఇళ్ల నిర్మాణం వేగవంతం చేయడంతోపాటు వివిధ అభివృద్ధి పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇళ్ల నిర్మాణం, టిడ్కో ఇళ్లు, జాతీయ ఉపాధి హామీ పనులు తదితర అంశాలపై మండల ప్రత్యేకాధికారులు, సంబంధిత అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ లేఅవుట్లలో మౌలిక వసతుల కల్పన త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో రోజుకి 1200 నుండి 1500 వరకు ఉపాధి కూలీలకు పని కల్పించాలన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయించాలని, బాల్యవివాహాలు నిరోధించాలని ఆదేశించారు.

టిబి బారిన పడిన వ్యక్తులను గుర్తించాలి

టిబి బారిన పడిన వ్యక్తులను గుర్తించి వారికి సరైన చికిత్స అందిస్తే క్షయవ్యాధిని నిర్మూలించవచ్చునని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా కలెక్టరేట్లో ప్రపంచ టిబి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా నుంచి టిబి వ్యాధిని పారదోలి టిబి వ్యాధిరహిత జిల్లా దిశగా అడుగులు వేయడంలో ప్రజల మద్దతు, భాగస్వాములు కావాల్సి ఉందని అన్నారు. టిబి వ్యాధిగ్రస్తులు ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల్లో టిబి పట్ల ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. 2025 నాటికి జిల్లాలో టిబి వ్యాధిని లేకుండా చేయాలని కలెక్టర్ సూచించారు. ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ మాట్లాడుతూ ప్రతి లక్ష మంది జనాభాలో రెండు వేల మందికి టెస్టులు చేయాలని సూచించారు. డిఆర్ఒ కె.కృష్ణవేణి మాట్లాడుతూ ఎన్‌జిఒలు, వైద్య సిబ్బంది, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేసి టిబి వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని సూచించారు. వైద్యశాఖలో పని చేసిన సిబ్బందికి, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు సర్టిఫికెట్లను, మెమెంటోలను ప్రదానం చేశారు. టిబి వ్యాధి నిర్మూలనకు సంబంధించిన మూడు రకాల పోస్టర్లను ఆవిష్కరించారు. టిబి వ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్లను కలెక్టర్ చేతుల మీదుగా అందించారు.

ఏమైనా పోషకాహార వస్తువులు అందించాలి

జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు అందించే వివిధ రకాల పోషకాహార వస్తువులు నాణ్యమైన, సరైన కొలతల ప్రకారం అందించాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లో అంగన్వాడీ, సివిల్ సప్లయీస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ కింద జిల్లాలోని అన్ని అంగన్వాడీ కేంద్రాలకు అందించే పప్పు, బాలామృతం, బియ్యం, కోడిగుడ్లు, పాలు తదితర అన్ని వస్తువులూ సక్రమంగా సరైన సమయానికి సరైన తూకంతో నాణ్యమైన వస్తువులు అందించాలని సూచించారు. ఎవరైనా సక్రమంగా అందించకపోతే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మోడీ ప్రభుత్వ విధానాలకు నిరసనగా 5న చలో ఢిల్లీ

జయప్రదం చేయాలని జీపు జాతా ప్రచారం -భీమవరం మండలంలో మోటారు సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఢిల్లీలో ఏప్రిల్ 5న చేపట్టబోయే ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన జీపుజాతాను శుక్రవారం స్థానిక బ్రహ్మానందరెడ్డి మార్కెట్ దగ్గర రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్నుద్దేశించి సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను గాలికొదిలేసి సంపన్నులకు ప్రభుత్వ సంస్థలను కట్టబెట్టే పనిలో ఉందని విమర్శించారు. కనీస ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారన్నారు. ప్రజలు తమ సమస్యపై పోరాడకుండా మతం పేరుతో వారి మధ్య చీలిక తీసుకొచ్చి పబ్బం గడుపుకుంటోందని అన్నారు. అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని కోరారు. రైతుల ఆదాయాలను రెట్టింపు చేస్తామని అధికారంలోకొచ్చిన మోడీ ప్రభుత్వం తన అసంబద్ధ విధానాలతో రైతులను ఆత్మహత్యలకు పురిగొల్పుతోందన్నారు. వ్యవసాయ నల్ల చట్టాల రద్దు కోసం సాగిన పోరాటం సందర్భంగా ఇచ్చిన హామీలను తక్షణం అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు, ఉపాధి భద్రత, పిఎఫ్, పెన్షన్, వైద్యఆరోగ్య సౌకర్యాలు, సమగ్ర చట్టం కలగా మిగిలిపోయాయన్నారు. ప్రజలకు నిత్యావసర వస్తువులు సరఫరా చేయడంలో కీలకంగా పని చేస్తున్న హమాలీలకు ప్రభుత్వం నుండి ఎటువంటి సౌకర్యాలూ అందడం లేదని విమర్శించారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో చేపట్టనున్న కార్మిక, కర్షక పోరాట ప్రదర్శనలో అంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నేతలు ఎం.సత్యనారాయణ, కండెల్లి సోమరాజు, జవ్వాది శ్రీను, కరెడ్ల రామకృష్ణ, గొన్నాబత్తుల నాగేశ్వరరావు, ఎ.ధర్మారావు, పతివాడ నాగేంద్రబాబు పాల్గొన్నారు.



తణుకులో మాట్లాడుతున్న గోపాలన్

పెంటపాడు: చలో ఢిల్లీ ప్రచార జీపు జాతా స్థానిక గాంధీబొమ్మ సెంటర్‌కు చేరుకున్న సందర్భంగా సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతా నేతలు మాట్లాడగా స్థానిక నేతలు సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు, కరక వెంకట్రావు, సత్తి కోదండరామిరెడ్డి, అడపా ఆంజనేయులు, యండ్రపు కృష్ణ, వడ్డీ సత్యనారాయణ, జె.శ్యామలకుమారి, ఆర్.అనురాధ, జయంతి, సీత పాల్గొన్నారు.

గణపవరం: కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసించాలని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. చలో ఢిల్లీ జీపు ప్రచార జాతా గణపవరం చేరుకున్న సందర్భంగా స్థానిక పోలీస్ ఐలాండ్ వద్ద జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు, నాయకులు పి.నరసింహమూర్తి, పి.గోవింద్, జి.శ్రీను, ఎం.సూర్యారావు, ఎస్.సంజీవరావు, ఎస్‌కె.వలీ, పి.శ్రీను పాల్గొన్నారు.

అత్తిలి: అదాని, అంబాని ఇద్దరు కార్పొరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్న మోడీ ప్రభుత్వ విదానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన చలో ఢిల్లీ ప్రచార జీపు జాతా అత్తిలి చేరుకుంది. ఈ సందర్భంగా సెంటర్‌లో జరిగిన సభలో జాతా నేతలు మాట్లాడగా ప్రజాసంఘాల నాయకులు కేతా గోపాలన్, కె.ధర్మేంద్ర, మళ్ల సూర్యారావు, బొట్టా అప్పన్న, ఎల్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెంలో జాతాను ప్రారంభిస్తున్న బాబూరావు

తణుకురూరల్: ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమంలో ప్రజలంతా పాల్గొనాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వి.గోపాలన్ కోరారు. చలో ఢిల్లీ జీపు ప్రచార జాతా స్థానిక నరేంద్ర సెంటర్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ నిత్యావసరాల ధరలు తగ్గించాలని, ప్రభుత్వరంగ ప్రయివేటీకరణను ఆపాలని, స్కీమ్ వర్కర్స్‌కు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ జాతాలో జిల్లా నేతలతోపాటు అడ్డగర్ల అజయకుమారి, పి.దక్షిణామూర్తి, కామన మునిస్వామి, బళ్ల చినవీరభద్రరావు, గుబ్బల గోపీ పాల్గొన్నారు.

భీమవరం మండలంలో మోటారు సైకిల్ యాత్ర

భీమవరం రూరల్: కేంద్రంలో బిజెపి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చేపట్టిన చలోఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. తోకతిప్ప గ్రామంలో మోటార్ సైకిల్ యాత్ర ప్రారంభించారు. యాత్ర తోకతిప్ప నుంచి నాగిడి పాలెం దొంగ పిండి కొత్త పూసలమూరు గొట్లపాడు నాగేంద్రపురం దెయ్యాలు తప్ప రామాయణపురం గ్రామాలలో యాత్రలు కొనసాగే అన్నారు ఈ కార్యక్రమంలో బొడ్డు లక్ష్మీపతి తోటి శుభకర రావు భూపతి సామేలు వాటాల పెద్దిరాజు పాల్గొన్నారు.

కులవ్యవస్థపై తిరుగుబాటే భగత్‌సింగ్‌కు నివాళి

పలుచోట్ల వర్ధంతి సభలు, కాగడాల ప్రదర్శన

ప్రజాశక్తి - భీమవరం

కులవ్యవస్థపై తిరుగుబాటే భగత్‌సింగ్‌కు నిజమైన నివాళి అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు అన్నారు. సర్దార్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 92వ వర్ధంతి సందర్భంగా స్థానిక లంకపేటలో కెవిపిఎస్ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ భగత్‌సింగ్ జీవితం నేటి యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్ మాట్లాడగా దళిత నాయకులు బల్ల రత్నంరాజు పాల్గొన్నారు.

నరసాపురం: దేశ భవిష్యత్తు కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ పోరాట స్ఫూర్తితో ప్రజల సమస్యలపై పోరాటం చేస్తామని సిపిఎం పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు తెలిపారు. శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లో 92వ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమం అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పొన్నాడ రాము, నోముల కొండ తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్ర: అమరవీరుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సాయంత్రం పొలమూరులో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రదర్శనలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కేతా పద్మజ, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, బాలల సంఘం అధ్యక్షుడు రిషి, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి చింతపల్లి మావో, చింతపల్లి భారతి తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: సిఐటియు కార్యాలయం వద్ద భగత్ సింగ్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకురు నాగేశ్వరరావు మాట్లాడగా గౌరీ శంకర్, కొల్లి రామకృష్ణ, దత్తు రాము, కరక వెంకట్రావు పాల్గొన్నారు.

గణపవరం: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ త్యాగాలు మరువలేనివని సిపిఎం మండల కార్యదర్శి పి.నరసింహమూర్తి అన్నారు. అమరవీరుల వర్ధంతి సభ కేశవరం మల్లపురాజుపేటలో జరిగింది. కార్యక్రమంలో నేతలు పి.శ్రీనివాసరావు, బొక్కా నరసింహమూర్తి, రాయల ఆంజనేయులు, బొబ్బిలి వీర్రాజు, ఎం.తాతారావు, సిహెచ్.పార్వతి, పి.లక్ష్మి పాల్గొన్నారు.



పెనుమంట్ర మండలం పొలమూరులో..

ఇదేమి చోద్యం

డ్వాక్రాలో అవకతవకలు తేల్చినా చర్యలు శూన్యం
గరగపర్రులో అవకతవకలపై చర్య తీసుకోవడానికి ఆరు నెలలు గడువా?
ఎపిఎం రవికుమార్ తీరుపై అనుమానాలు

ప్రజాశక్తి - పాలకోడేరు

గరగపర్రులోని డ్వాక్రా సంఘాల్లో అవకతవకలపై అధికారులు విచారణ చేపట్టి లోపాలున్నాయని తేల్చారు. అయితే అవకతవకలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి మాత్రం వెనకాడుతున్నారు. సొమ్ము కాజేశారని గుర్తించినప్పటికీ ఆ సొమ్మును రికవరీ చేయకుండా వారికి ఆరు నెలలు గడువు ఇవ్వడం, అదీ ఎపిఎం రవికుమార్ కావడం సర్వత్రా చర్చనీయాంశమైంది. ఆయన తీరు పలు అనుమానాలకు తావిస్తోందని గ్రామస్తులు, డ్వాక్రా సంఘాల సభ్యులు అభిప్రాయపడుతున్నారు.

అవకతవకాలపై శుక్రవారం మరోమారు విచారణ చేపట్టారు. రూ.ఐదు లక్షలు అవకతవకలు జరిగాయని గుర్తించారు. కొన్ని సంఘాల్లోనే రూ.లక్షల్లో గోల్‌మాల్ జరిగినట్లు తేలిన తరుణంలో అన్ని సంఘాలను పరిశీలించాల్సిన బాధ్యత అధికారులకు లేదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. విచారణ సమయంలో ఒబి ప్రెసిడెంట్లు, ఇతర సిబ్బంది పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడం గమనార్హం. ఐదు లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు గుర్తించిన అధికారులు ఆ సొమ్ము రికవరీకి ఆరు నెలలు గడువిస్తున్నట్లు ఎపిఎం రవికుమార్ ప్రకటించడం అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసింది. బాధ్యులను తప్పించాలనే కోణంలో ఎపిఎం విచారణ చేస్తున్నారని ఫిర్యాదుదారు వెంకటలక్ష్మి ఆరోపిస్తున్నారు. దీనిపై ఎపిఎం రవికుమార్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా అవకతవకలు వాస్తవమేనన్నారు. రూ.ఐదు లక్షల్లో రెండు నెలల్లో సగం, ఆరు నెలల్లో మిగతా సగం గ్రామ సంఘాలకు జమ చేయాలని చెప్పానన్నారు.

కొన్ని ఆరోపణలే వాస్తవం : డ్వాక్రా సిఎ భవాని

తనపై వస్తున్న ఆరోపణలు కొన్ని మాత్రమే వాస్తవమని డ్వాక్రా సిఎ భవాని చెప్పారు. ఈ ఆరోపణలకు బాధ్యత వహించాల్సిన ఒబి ప్రెసిడెంట్లు, అధికారులు తప్పించుకుంటున్నారని ఆరోపించారు. గతంలో సిఎగా పని చేసిన రామచంద్రరావు కూడా బాధ్యుడని ఆమె ఆరోపించారు.

డ్వాక్రా సంఘం నేత నిర్బంధం

ప్రజాశక్తి - వీరవాసరం

ఓ స్వయం సహాయక సంఘానికి చెందిన నాయకురాలిని సంఘం సభ్యులు నిర్బంధించి దేవాలయం స్తంభానికి కట్టేసిన సంఘటన శుక్రవారం వీరవాసరంలో చోటు చేసుకుంది. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి ఆమెను విడిపించి స్టేషన్‌కు తీసుకెళ్లారు. పోలీసులు, సంఘ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మహాలక్ష్మీ స్వయం సహాయక సంఘం రెండున్నరేళ్ల క్రితం బ్యాంకు ద్వారా రూ.6 లక్షల రుణం తీసుకున్నారు. వాయిదాల రూపంలో చెల్లించాల్సిన రుణాన్ని సంఘం నాయకురాలు పావనిదుర్గకు ఇచ్చి బ్యాంకులో జమ చేయించేవారు. అయితే పావనిదుర్గ రూ.3.80 లక్షలు బ్యాంకుకు చెల్లించకుండా వాడుకోవడంతో గతంలో సభ్యులు గుర్తించారు. దీంతో సభ్యులు ఆమెను నిలదీసి ఆమెపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సొమ్ము తిరిగి చెల్లిస్తానని చెప్పడంతో సంఘం సభ్యులు ఆమెతో రాజీ పడ్డారు. అయితే పావనిదుర్గ రూ.లక్ష మాత్రమే జమ చేసింది. మిగిలిన సొమ్ము విషయమై సభ్యులు ఆమె ఇంటికెళ్లి నిలదీశారు. ఆమె సరైన సమాధానం చెప్పకపోవడంతో గురువారం రాత్రి ఆమెను సమీపంలోని ఓ దేవాలయం వద్దకు చర్చించేందుకు పిలిచారు. అయినప్పటికీ ఆమె, ఆమె భర్త, కుటుంబ సభ్యుల నుంచి సరైన సమాధానం రాకపోవడంతో కుటుంబ సభ్యులందరినీ ఆ రాత్రంతా దేవాలయంలో నిర్బంధించారు. ఎంతకీ సమాధానం చెప్పకపోవడంతో శుక్రవారం ఉదయం పావనిదుర్గను స్తంబానికి కట్టేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఆమెను విడిపించి ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ఆక్వాసాగులో టెక్నీషియన్ల అవసరం ఎక్కువ

భీమవరం రూరల్: ఆక్వా సాగులో టెక్నీషియన్ల అవసరం ఎంతో ఉందని పలువురు శాస్త్రవేత్తలు తెలిపారు. స్థానిక కెజిఆర్ఎల్ కళాశాలలో శుక్రవారం జువాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో 'ఆక్వాకల్చర్ ప్రస్తుత అధునాతన విధానాలు' అనే అంశంపై రెండు రోజులు జాతీయ సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సైంటిస్ట్ ఐసిఎఆర్ నుండి విచ్చేసిన అన్నం పవన్‌కుమార్, ఎపి ఫిషరీస్ యూనివర్సిటీ నుండి వచ్చిన ప్రిన్సిపల్ హెడ్ సైంటిస్టులు టి.నీరజ విచ్చేశారు. ఈ సెమినార్‌కు ప్రిన్సిపల్ డాక్టర్ మెంటే హరినాధబాబు, వైస్ ప్రిన్సిపల్ మెరగాని అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి పవన్‌కుమార్‌తోపాటు డాక్టర్ నీరజ, ప్రెసిడెంట్ కొటికలపూడి గోవిందరావు, సెక్రటరీ మెంటే రామమనోహర్, ట్రెజరర్ గన్నాబతుల వెంకట శ్రీనివాస్, పీజీ డైరెక్టర్ తోట రామ్మూర్తి, ఎంబిఎ డైరెక్టర్ వినోదరావు, వైస్ ప్రెసిడెంట్ ఇంటి రామచంద్రమూర్తి, ఫార్మసీ డైరెక్టర్ కవల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భూ సర్వేకు సహకరించాలి

వీరవాసరం:రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న భూసర్వే భూరక్ష పథకంలో భాగంగా కొనసాగుతున్న భూ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్పంచి చికిలే మంగతాయారు గ్రామస్తులను కోరారు. సర్వే నిమిత్తం డ్రోన్ ఎగురవేత కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. హైస్కూల్లో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో సర్వే అధికారులు మాట్లాడుతూ సహకారంతో సమస్యల పరిష్కారమే ఈ సర్వే ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు బోను జోగ్యారావు, వీరవల్లి ఉషారాణి, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

మొగల్తూరు:పశువులకు గాలికుంటు వ్యాధి సోకకుండా టీకాలు వేయనున్నామని పశు వైద్యులు జి.నీలిమ శుక్రవారం తెలిపారు. ఈ నెల 25 నుంచి వచ్చే నెల 24వ తేదీ వరకూ గ్రామాల వారీగా టీకాలు వేయనున్నామని తెలిపారు. రైతులు తమ పశువులకు టీకాలు వేయించాలని సూచించారు. 25న కొత్తపాలెం, కెపిపాలెంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామని తెలిపారు.

జివిఆర్‌కు నివాళి

భీమవరం రూరల్:మున్సిపల్ మాజీ ఛైర్మన్, వైసిపి సీనియర్ నాయకులు గ్రంధి వెంకటేశ్వరరావు (జివిఆర్) జయంతిని స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ముందుగా జివిఆర్ చిత్రపటానికి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, ఆయన తనయుడు రవితేజ నివాళులర్పించారు. అనంతరం ఆటో డ్రైవర్లకు దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, జెడ్‌పిటిసి కె.నరసింహారావు తదితరులు మాట్లాడారు.

బాధితురాలికి సాయం

ఉండి: విజయలక్ష్మి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వితంతు మహిళ దొండపాటి రామలక్ష్మికి ట్రస్ట్ ఛైర్మన్ నల్లా సత్యప్రసాద్ రూ.4 వేల నగదు, నెలకు సరిపడా నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం నల్లా ప్రసాద్ మాట్లాడుతూ ఉండికి చెందిన దొండపాటి రామలక్ష్మి భర్త సాంబయ్య కిడ్నీలు పాడై ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం రోజు గడవక ఇబ్బందుల్లో ఉందని తెలియగానే దొండపాటి రామలక్ష్మికి తన వంతు సహాయం అందించామని సత్యప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో పెద్దింటి శ్రీను ఉన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

భీమవరం రూరల్: 'హేకాన్ పోటీలు విద్యార్థుల్లో దాగిఉన్న వినూత్న ఆలోచనలు బయటకు తీసేందుకు ఎంతగానో దోహదపడతాయని భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.జగపతిరాజు అన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రజ్వలన పేరిట 24 గంటల పాటు నిర్విరామంగా జరిగిన హేకాన్ పోటీల్లో విజేతలకు శుక్రవారం బహుమతి ప్రదానోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ హెడ్ వి.చంద్రశేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడారు. ప్రథమ స్థానం భీమవరం విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు, ద్వితీయ స్థానం ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు, తృతీయ స్థానం కూడా ఎస్ఆర్‌కెఆర్ విద్యార్థులకు దక్కాయి. వారికి ప్రశంసాపత్రాలు, నగదు అందజేశారు.

శశి ఇంజినీరింగ్ కాలేజీలో ఫెస్ట్

తాడేపల్లిగూడెం:శశి ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ కాన్ఫరెన్స్ (ఫెస్ట్) 2023ను అప్లైడ్ సైన్స్ అండ్ హ్యుమానిటీస్ డిపార్ట్మెంట్, రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఒఎన్‌జిసి ఎక్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్ నారాయణ, గౌరవ అతిథిగా ఆంధ్రా యూనివర్శిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ డి.వి.శాస్త్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ మేకా నరేంద్ర కృష్ణ, ప్రిన్సిపల్ మొహమ్మద్ ఇస్మాయిల్, కన్వీనర్ సిహెచ్.శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి టి.వి.రఘు పాల్గొన్నారు.

తాతాజీ దాతృత్వం

పాలకొల్లు:పేద కుటుంబానికి మీటర్ వేయించి కరెంట్ ఇప్పించారు డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ. పాలకొల్లు రూరల్ మండలం పెదగరువు చెందిన పి.నాగమణి ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో కరెంట్ బిల్లు కట్టకపోవడంతో 3 నెలల క్రితం కరెంట్ తీసేశారు. దీంతో ఆ కుటుంబం చీకట్లోనే పిల్లలతో జీవనం సాగిస్తోంది. విషయాన్ని యడ్ల తాతాజీ దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన పరిశీలించి ఎలక్ట్రికల్ అధికారులతో మాట్లాడి బకాయి బిల్లు తానే చెల్లించి శుక్రవారం కొత్త మీటర్ వేయించి కరెంట్ ఇప్పించారు. వ్యాపారం చేసుకోవడానికి ఇస్త్రీ బండి ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గంటా నరేష్, విజయ్, కృష్ణాజీ, గణేష్ పాల్గొన్నారు.

'ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దు'

ఉండి:విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని వైసిపి ఉండి మాజీ అధ్యక్షులు రాయి సతీష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక 16వ వార్డు పడమర వాని పేటలో ట్రాన్స్ విద్యుత్ స్తంభం శిథిలావస్థకు చేరి ఒకవైపునకు ఒరిగిందని, పక్కనే ఉన్న ఇంటిపై పడిపోయే ప్రమాదం ఉందని, పలుమార్లు ఎలక్ట్రికల్ ఎఇ, లైన్ ఇన్‌స్పెక్టర్, లైన్‌మెన్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. స్పందనలో కూడా ఫిర్యాదు చేసినా విద్యుత్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి శిథిలావస్థకు చేరుకున్న స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభాన్ని ఏర్పాటు చేయాలని, లేకుంటే విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దోమ తెరలు వాడాలి

గణపవరం:దోమలు కుట్టకుండా ప్రతి ఒక్కరూ దోమతెరలు వాడాలని కాశిపాడు ఆరోగ్య సహాయకులు నామాల రాజు అన్నారు. శుక్రవారం డ్రై డే సందర్భంగా తాళ్లపాలెంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, లేకుంటే దోమలు చేరతాయని తెలిపారు. ఇంట్లోకి దోమలు రాకుండా గుమ్మాలకు, కిటికీలకు దోమతెరలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి.గోపినాథ్, ఆశా కార్యకర్త రమణ, ఎఎన్ఎం జయమ్మ పాల్గొన్నారు.

క్షయపై అవగాహనా ర్యాలీ

పెనుమంట్ర:రెండు వారాలపైబడి దగ్గు వస్తే క్షయగా పరిగణించవచ్చని పెనుమంట్ర పిహెచ్‌సి వైద్యాధికారిణులు కె.లావణ్య, వై.అనూష తెలిపారు. ప్రపంచ క్షయ నివారణా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక పిహెచ్‌సి వద్ద ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు.

తాడేపల్లిగూడెం : ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా తాడేపల్లిగూడెం 3ఎఫ్ స్వామినాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం 60 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్లు కలెక్టరేట్‌లో కలెక్టర్ చేతుల మీదుగా అందజేసినట్లు ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ డి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో 3ఎఫ్ స్వామినాన్ ఫౌండేషన్ తరపున శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టిడిపి గెలుపుపై హర్షం

పోడూరు:మూడు గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి, ఎంఎల్ఎ కోటా ఎంఎల్‌సి ఎన్నికల్లో వరుస విజయాలు సాధించడంపై టిడిపి మండల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం జిన్నూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం తథ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి బొక్కా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొల్లు : రాష్ట్రంలో జగన్ పని అయిపోయిందని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చెప్పారు. ఎంఎల్‌సిగా అనురాధ ఘన విజయం సాధించిన సందర్భంగా స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద శుక్రవారం భారీ విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టి, బాణాసంచా కాల్చారు. కర్నేన గౌరు నాయుడు, బాబు, కోడి విజయ భాస్కర్, బోనం నాని పాల్గొన్నారు.

సంపూర్ణ పారిశుధ్యం అందరి బాధ్యత : కలెక్టర్

పాలకోడేరు :ఇంటి పరిసరాలు ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో గ్రామాన్ని కూడా అంతే శుభ్రంగా ఉంచాలని, సంపూర్ణ పారిశుధ్యం అందరి బాధ్యతని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. విస్సాకోడేరులో గ్రామ సర్పంచి బొల్ల.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ ప్రశాంతి, సర్పంచి శ్రీనివాస్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేంద్రం నిర్వహణ, పరిసర ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేసి సర్పంచిని అభినందించారు. శిక్షణ నిమిత్తం ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రానికి వచ్చిన యలమంచిలి మండలం సింగరాయపాలెం కలగంపూడి, పాలకొల్లు మండలం దగ్గులూరు, లంకలకోడేరు, పాలకోడేరు మండలం వీస్సాకోడేరు, గొరగనమూడి గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు, డిపిఆర్‌సి సిబ్బందికి ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి సర్పంచి బొల్లా శ్రీనివాస్ అధ్యక్షత వహించి మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో ఎస్‌డబ్ల్యూపిసి కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జిల్లాలో మూడు చోట్ల సంపద తయారీ కేంద్రాలను పరిశీలించానని, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ఎంతో కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఉప సర్పంచి కందుల నాగరాజు, కోఆప్షన్ సభ్యులు డాక్టర్ స్వర్ణలత, ఎంపిటిసిలు బోల్లం గాంధీ, లక్ష్మీపతి, జిల్లా పంచాయతీ అధికారి నాగలత, మండల ప్రత్యేక అధికారి రమణ, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మురళీ గంగాధర్ పాల్గొన్నారు.



సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల ప్రతిభ

తణుకురూరల్:ఉమ్మడి జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 23న ఏలూరులోని రామచంద్ర ఇంజినీరింగ్ కళాశాలలో యువఉత్సవ్ పోటీల్లోతణుకు ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు బి.లతామల్లేశ్వరి, టి.ఇందుశాలిని, టి.పావని, కె.కార్తీకకు క్లాసికల్‌లో ప్రథమ బహుమతి రూ.5 వేలు నగదు పురస్కారం లభించింది. పెయింటింగ్‌లో కె.మౌనికకు ప్రథమ బహుమతి, రూ.వెయ్యి నగదు పురస్కారం, డిక్లమేషన్ విభాగంలో బి.రోషిణికి తృతీయ బహుమతి, రూ.వెయ్యి నగదు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ కె.రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఆయా విద్యార్థినులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు తెలిపారు.

కొడమంచిలి గ్రామాభివృద్ధికి శ్రీకారం

ఆచంట: ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాధరాజు సహకారంతో కొడమంచిలి గ్రామాభివృద్ధికి శ్రీకారం చుట్టినట్లు సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ తెలిపారు. శుక్రవారం కొడమంచిలి పంచాయతీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమావేశంలో కార్యదర్శి షేక్ హినా భాను, ఉపసర్పంచి ములగాడ వరప్రసాద్ పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేత

ప్రజాశక్తి - పెనుమంట్ర

సామాజిక సేవ లక్ష్యంగా ద్వారంపూడి ఎడ్యుకేషన్ సొసైటీ (ఆంధ్ర అసోసియేషన్ యుకె) జూనియర్ కళాశాలలో పదో తరగతి మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ తేతలి సంజీవరెడ్డి అన్నారు. శుక్రవారం కళాశాలలో పెనుమంట్ర చుట్టుపక్కల ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుకున్న పేద విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ 1993లో తమ కళాశాలను దాతల సహకారంతో ప్రారంభించామన్నారు. 30 సంవత్సరాలుగా ఉత్తమ ఫలితాలతో, అతితక్కువ ఫీజుతో దిగ్విజయంగా నడపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మెంబర్ తేతలి గుర్రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎ.సత్యప్రకాష్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

కిశోర బాలికలు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని ఐసిడిఎస్ మార్టేరు సెక్టార్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. శుక్రవారం మార్టేరు బసంతిదేవి బాలికల హైస్కూల్లో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మార్టేరులో జరిగిన కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.